

# నిష్టూరం

ఎస్. కాశీవిశ్వనాథం



అప్పలసూరికి నిద్ర పట్టడం లేదు. వాతావరణం అనుకున్నవన్నీ సాధించుకున్నవాని మనసులాగ చల్లగానూ, దేవుణ్ని చూసినవాని ముఖంలాగ ప్రశాంతంగానూ వుంది. వేసుకున్న పక్క రాజహంస వీపులాగ మెత్తగా వుంది. అయినా అతనికి నిద్ర పట్టడం లేదు.

నోట్లో బీడీ అయిపోయిందో, ఆరిపోయిందో తెలియదు గానీ, చిరాకుతో నేలక్కొట్టి మరోటి వెలిగించాడు. బీడీలు తరుగుతున్నాయి, నిమిషాలు జరుగుతున్నాయి తప్ప నిద్ర మాత్రం రావటం లేదు. అందుకు అతని ఒంట్లోని నలత గానీ, ఇంట్లోని కలత గానీ కారణం కాదు. పక్క మీద ఇటు నుంచటు దొర్లాడు. అటు నుంచిటు దొర్లాడు. కానీ, లాభం లేకపోయింది.

రావులమ్మ జ్ఞాపకాలు అతనికి దూరం కావటం లేదు. మనసులో ఆమెను గురించిన ఆలోచనలు ఎంతకీ తెరిపి ఇవ్వటం లేదు. ఆమె జ్ఞాపకం వచ్చినప్పుడల్లా కంట్లో నలక పడినట్లు ఇబ్బందిగా బాధ పడుతున్నాడు. అతనిలో ఇంతటి సంక్షోభం రేపిన రావులమ్మ ఎవరు?

రావులమ్మ అతని భార్య కాదు!
అప్పచెల్లెలు అంతకన్నా కాదు!
ప్రియురాలు-ఛ ఛ! కానే కాదు!!!

రావులమ్మ తల చెడిన ముండ. రావులమ్మ మొగుడు కొండగాడు- పదేళ్ల క్రితం గుంటూరులో జరిగిన బస్సు ప్రమాదంలో

చచ్చిపోయాడని కొందరంటే, కాదు, విశాఖపట్నంలో ఉంచుకున్న ముండతో ఊరేగుతున్నాడని మరి కొందరంటారు. ఏమైనా రావులమ్మకి మగదిక్కు లేదు. అయితే, దూరమైన మొగుడి వల్ల పుట్టిన పిల్లలు మాత్రం ఆవిడతో వున్నారు. అయితే, ఇవేవీ అప్పలసూరి బాధకు బాధ్యత వహించవు. రావులమ్మ అప్పలసూరి టీ దుకాణంలో పప్పు రుబ్బుతుంది. ఇడ్లీలు వేస్తుంది. దానితోపాటు కొబ్బరి చట్నీ, బొంబాయి చట్నీ కూడా చేస్తుంది.

కృష్ణాపురం పట్నం కాదు, అలాగని మరీ పల్లెటూరూ కాదు. మారీమారని పల్లెటూరంటే కొంతలో కొంత నయం. ఆ ఊళ్లో దాదాపు వెయ్యి గడప వుంటుంది. ప్రతి పల్లెటూరి మాదిరిగానే పొలాలు, పశువులు, కొద్దిగా చదువుకున్న కొంత మంది, ఏమీ చదువుకోని ఎంతో మంది వున్నారు ఆ ఊళ్లో. వారితో పాటు అరడజనుకు దగ్గరగా హోటళ్లు (టీ దుకాణాలు) వున్నాయి. అయితే, 'పురుషులందు పుణ్యపురుషులు వేరయా' అన్నట్టు, 'టీ కొట్ల యందు అప్పలసూరి టీ కొట్టు వేరయా' అని చెప్పడానికి ఆ కొట్లో దొరికే అద్భుతమైన ఇడ్లీయే కారణం! ఆ కొట్లో దొరికేటంతటి ప్రశస్తమైన ఆహారం, ఇటు విజయనగరంలో గానీ, అటు విశాఖపట్నంలో గానీ దొరకదని తరచుగా ఆ ఊరు వెళ్లేవాళ్లు చెబుతుంటారు!

ఆ హోటలు పెట్టేనాటికి అప్పలసూరి నెత్తి మీద రెండు వేల రూపాయల అప్పు వుండేది. దాని మీద ఐదు వందల దగ్గిర దగ్గిర వడ్డీ వుండేది. హోటలు పెట్టి రెండో ఏడు వెళ్లీ వెళ్లకముందే ఆ బాకీలన్నీ వడ్డీతో సహా తీర్చేయగలిగాడు. ఇలా ఈ వ్యాపారం మరి కొన్నాళ్లు జరిగితే, తన పెద్ద కూతురికి పట్నం సంబంధం ఖాయం చేయాలని కూడా ప్లాన్ వేశాడు. అయితే, రావులమ్మ గురించి చెబుతూ, ఇదంతా ఎందుకంటారేమో! అప్పలసూరి అభివృద్ధికి కారణం ఆ కొట్లో దొరికే ఫలహారాలైతే, వాటిని తయారుచేసేది రావులమ్మ!

ఇంతటి ప్రాముఖ్యం కలిగిన రావులమ్మ ఇంటికి ఓ నాడు వాళ్లప్ప కొడుకు అప్పారావు వచ్చాడు.

తాడూ, బొంగరం లేకుండా బలాదూరుగా తిరిగిన అప్పారావు, ఆ నాటికి ఇలా ఆకస్మికంగా కనిపించేసరికి, తనకి విముక్తి కలిగించవచ్చిన శ్రీరాముణ్ని చూసిన అహల్యలాగ ఆనందపడింది రావులమ్మ. ఎక్కడెక్కడో తిరిగిన అప్పారావు అనుకోకుండా ఇంటికి రావడమే గాక, ఎప్పుడూ

ఈ కథను ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 15.9.1971 సంచికలో ప్రచురించాము



వినని వింత సలహా ఇస్తూ, ఇదిగో ఇలా అన్నాడు:

"పిన్నమ్మా! ఎంత కాలమే ఇలా ఒకల్దగ్గిర పనేసేస్తావు? ఇలా ఎన్నాళ్లు పని చేసినా, రెక్కలు ముక్క లిరుసుకున్నా, ఆ రోజుకి నీకూ, నీ పిల్లలకీ కడుపు నిండతాదే తప్ప, కాండబ్బు ఎనకెయ్యలేవు గదా! నీకు సూస్తే ముగ్గురూ ఆడకూతుళ్లాయె!-మా సినబాబొచ్చి నిన్ను ఉద్ధరిస్తాడనుకోకు. మరో దేవుడొచ్చి మన కష్టాలు తీరుస్తాడనీ అనుకోకు. నీ బతుకులో నువ్వే దీపమెలిగించుకోవాల. ఎన్ని పాపాలు సేసినా, నాలుగు డబ్బులు ఎనకేసుకున్నోడే ఈ లోకంలో సుకంగా బతగ్గలడు. ఒకడు పెద్దోడయ్యాడంటే, ఆడి పెద్దరికాన్నే పెజానీకం గౌరవిస్తాది గానీ, ఆడు పాపాలు సేసి పెద్దోడయ్యాడా, పున్నేలు సేసి పెద్దోడయ్యాడా అని ఎవులూ ఆలోసించరు. నిన్ను పాపాలు సెయ్యమనను గానీ, సిన్న టీ దుకాణం సొంతంగా ఎట్టమంటున్నాను. నాలుగు కాన్లు కూడబెట్టి, ఆడగుంట్లకి నాలుగచ్చింతా లెయ్యమంటున్నాను. ఇడ్లీ ఏటి, ఉప్మా ఏటి, మరో టిపిన్ ఏటి-ఏది సెయ్యాలన్నా నిన్ను మించిన మొగోడు గానీ, ఆడది గానీ నాకు తెలిసినంత మట్టుకు ఈ సుట్టుపట్ల లేరు. ఇన్నాళ్లూ నేను బలాదూరుగా తిరిగినా, బెమ్మాండంగా టీ సెయ్యటం నేర్చుకున్నాను. టీ సెయ్యడం నేర్చుకుంటే కాకావోల్దగ్గిరే నేర్చుకోవాలి. టీలో నల్లమందు కలిపితేనేం గాక, నాలుగు డబ్బులు మూట గడతారు. నాకేటి, టీ దుకాణమేటని, నువ్వు ఎనక్కి నాగకు. ఈ నాడు దొరల్లాగ మీసాలు తిప్పుతున్న మారాజులంతా మొదట మన్లాగే సిన్న సిన్న ఏపారాలు ఎట్టినోల్లే. కానీకి కానీ జత సేసి ఆళ్లు మేడల మీద మేడలు నెగ్గొడతావుంటే, మనం ఆళ్ల దగ్గిర పని సేసీ సేసీ ఉస్సూరంటూ బండి నాగించేస్తున్నాం తప్ప, కొంపల మీదికి కొత్త కమ్మయినా ఏయించుకోనేకపోతన్నాం. అంచేత నేను సెప్పినట్టు సిన్న ఓటేలు ఓపినింగు సెయ్యి. అక్కడా ఇక్కడా ఒద్దు. ఈ ఇంటి కాడే, ఈ గుమ్మంలోనే ఎట్టు."

ఈ మాటలు రావులమ్మను కదిలించాయి. చీకట్లో నడుస్తున్న తనకి అప్పారావు బేటరీ దీపం ఇచ్చాడని సంతోషించింది.

ఓ రోజు అప్పలసూరి ఆ రోజు అమ్మకం లెక్క చూసుకుంటున్నప్పుడు, రావులమ్మ మెల్లిగా-"నాను పని మానేస్తన్నాను, సూరిబాబూ!" అంది.

అప్పలసూరి అదిరిపడలేదు గానీ, కొంచెం ఆశ్చర్యపోతూ, "ఏం? జీతం సాలటం లేదా? కావాలంటే మరో బేడ ఏస్తాన్లే. అంతే గానీ పని మానీకు" అన్నాడు.

"జీతం సాలక కాదు బాబూ. మా అప్ప కొడుకు రంగం నించి తిరిగొచ్చాడు. ఆడూ, నేనూ కలిసి మా ఇంటి కాడే సిన్నదో, సితకదో టీ దుకాణవెట్టాలనుకుంటన్నాం" అంది రావులమ్మ.

రావులమ్మ చెప్పిన మాటలు మాటలుగా కాక తూటాలుగా మారి తన గుండెలోకి దూరిపోయినంతగా బాధ పడ్డాడు. అంతే గాక నిశ్చింతగా నిద్ర పోతున్న తన పక్కలో పిడుగు పడినట్టుగా అదిరిపోయాడు. తరవాత జ్వరం వచ్చినవాడిలాగ విలవిల్లాడిపోయాడు. రావులమ్మకేం సమాధానం చెప్పాలో అర్థమవలేదు. "బాగా ఆలోసించుకున్నావా?" అని మాత్రం అనగలిగాడు.

"ఆలోసించుకోడాని కేటుంది, సూరిబాబూ? ఇన్నాళ్లూ ఏ దిక్కూ నేక అడివిలోని కంపలాగ వుండిపోనాను. మా అప్పకొడుకైతేనేటి, నా కొడుకైతేనేటి ఒక్క పేగెరుసు గానీ, ఆడు ఇన్నాల్ల కింటి కొచ్చాడు. నా ఆడగుంటలకి నాలుగచ్చింతా లెయ్యాలంటే, ఆడు సెప్పిన ఉపాయం కన్నా మరో తోవ కనబడ్డం నేదు.

అద్దెకున్నవాడు ఆ ఇల్లు కొనాలని బేరం ఆడడం యజమాని దృష్టిలో నేరమే. పనివాడు యజమానిగా మారితే సహించడం మాటలా మరి? విచిత్రం-ఈ రెండు తరహాల వ్యక్తులనూ మింగగలిగిన 'స్వార్థం' ముందు వీరి గోడు అరణ్యరోదనమేనేమో...!



మీరేటనుకోకుండా మరో మణిసిని సూసుకోండి" అంటూ రావులమ్మ ఆ రోజు నుంచి పనిలోకి రావడం మానేసింది.

అదిగో, ఆ రోజు నించి అప్పలసూరి మంత్రం మరిచిపోయిన మాంత్రికుడిలాగ మతి లేకుండా తిరుగుతున్నాడు. తన ఒంట్లోంచి రక్తం, పేగులూ మాత్రమే గాక, గుండెకాయను కూడా ఎవరో నిర్దాక్షిణ్యంగా కత్తిరించుకుపోయినంతగా బాధ పడిపోతున్నాడు. రాత్రులూ, పగళ్లూ రావులమ్మ పెట్టబోయే టీ దుకాణం గురించే ఆలోచిస్తున్నాడు.

రావులమ్మ వయసు మళ్లిందేం కాదు. శుభ్రంగా స్నానం చేసి, చుక్కల చీర కట్టుకుంటే చుక్కలాగుంటుంది. మనసు పెట్టి ఇడ్లీ చేస్తే, మజామజా గుంటుంది. నాగమల్లిపూవు లాంటి రావులమ్మ చేత్తో మజాగుండే మెత్తని ఇడ్లీ ఇస్తుంటే, వాటినొదిలిపెట్టి తన కొట్టు దగ్గరికొచ్చి టిఫిన్ చేసే తెలివితక్కువవాళ్లు ఎవరూ వుండరు. తన కొట్టు ఈ మధ్యనే పెద్దదైంది. ఇడ్లీ, దోసె, ఉప్మాతో పాటు మసాలాగారె, బన్ను, రొట్టె, కొత్తరకం కాఫీ, టీ గూడా మరో నెల రోజుల్లో పెట్టి, కొట్టు మరింత మోపు చేయాలని ప్లాన్ వేశాడు. పెద్ద కూతురికి పట్నం సంబంధం చేయాలని కూడా పథకం వేశాడు... ఇంకా చాలా చాలా ఆలోచించాడు. కానీ, రావులమ్మ ఇంత అర్ధాంతరంగా తన కొట్లో పని మానేస్తుందని అనుకోలేదు. ఇది తనకి పెద్ద దెబ్బే! మానేస్తే మానె గానీ, తన కొట్టు పక్కనే మరో టీ దుకాణం పెట్టడం మరింత దెబ్బ తనకి. దెబ్బ మీద దెబ్బ!

ఈ దెబ్బలకు తట్టుకోలేని అప్పలసూరికి మూడు-నాలుగు రోజుల నుంచి నిద్ర కూడా పట్టడం లేదు. అయిదోరోజున గాబోలు, ఓ నిశ్చయానికొచ్చి రావులమ్మ ఇంటికి వెళ్లాడు. వెళ్లి, కంఠతా పట్టి అప్పచెప్పినట్టుగా ఇలా అన్నాడు: "రావులమ్మా! నువ్వా పిల్లలు గలదానివి. ఆ పైన ఆడదానివి. నా మీద కత్తిగట్టి, నా మీద ఎగస్పార్టీగా ఈ ఊదిలోనే, నా కొట్టు పక్కనే మరో కొట్టు ఓపెనింగ్ సెయ్యడం దరమం కాదు. కొంచెం ఆలోసించు. కావాలంటే నీ పెద్ద కూతురి పెళ్లికి నా వంతో అర్ధనూటపదార్లు సాయం సేస్తాను. రామరాజు గారి దగ్గర ఓ వందో, రెండొందలో కావాలంటే అప్పు ఇప్పిస్తాను. అంతే గానీ, నువ్విలాగ పోటీకి నిలబడ్డం నాయం కాదు."

ఈ మాటలకి రావులమ్మ ఏమనాలనుకుందో తెలియదు గానీ, ఆమెకు అవకాశ మియ్యకుండా అప్పారావు అందుకున్నాడు: "మేం ఎవరి మీద పోటీకీ ఈ దుకాణవెట్టడం లేదు. మా బతుకులికి ఓ దారి మావే సూసుకోవాల గాబట్టి, ఈ టీ దుకాణవెట్టుకుంటన్నాం. మీరు పెద్దలు. అన్నీ తెలిసినోలు. మేం ఇలా సొంతంగా ఓ కారెం తలపెట్టినప్పుడు, మీలాంటాళ్లంతా మమ్మల్ని దీవించాల. అంతే గానీ, ఇలాగ వొద్దండం దరమం కాదు, సూరిబాబు గారూ!" అన్నాడు.

ఈ మాటలతో అప్పలసూరి అగ్గి మీద గుగ్గిలం వేసినట్టు మండిపడలేదు, నిప్పు మీద నీళ్లేసినట్టు చల్లబడిపోయాడు. అంతే గాక, దెయ్యం పట్టినమనిషిలాగ వెర్రిచూపులు చూస్తూ, "అయితే, నా దగ్గర అప్పుచ్చుకున్న రెండొందలు ఎంటనే కక్కండి!" అన్నాడు.

అప్పారావు ఆశ్చర్యపడ్డాడు. పడి "ఇదేంటి పిన్నమ్మా?" అన్నాడు.

రావులమ్మ కూడా షాక్ తిన్నట్టుగా ఉలిక్కిపడింది. కానీ, వెంటనే సర్దుకుని, "అవున్రా! పెద్దదానికి టైఫాయిడ్ జొరం వచ్చినప్పుడు మందు కర్సుకి, రెండోదాని సంవర్తకీ కలిపి ఈ బాబు కాడ మూడేబైలు పుచ్చుకున్నాను. దాని మీద వడ్డీతో ఒకటి తక్కువ రెండొందలైంది" అంటూ, అప్పలసూరి వైపు తిరిగి-"సూరిబాబూ, నీ బాకీ అనా పైసల్తో సహా తీర్చేస్తాను. నా మాట నమ్ము. తీసుకున్న డబ్బు ఎగేసేసినోల్లు కుక్కయి వుడతారు. ఎనక జెనమలో ఏ పాపాల పంట పండించావో గాని, ఈ జెనమలో ఇలా బతుకుతున్నాను. మల్లీ ఈ జెనమలో తీసుకున్న డబ్బు ఎగ్గొట్టి మరో పాపం సెయ్యలేను. బాకీ ఒక్కసారిగా కాకపోయినా, దఫాలుగానైనా తీరుస్తాను. ఈ కొట్టు ఎట్టాక, ఎర్రని డబ్బు కల్ల సూస్తే తెచ్చి నీ బాకీ కిందే జమకడతాను. కొంత టయిం ఇయ్యి" అంది దీనంగా.

అప్పలసూరి రావులమ్మ ప్రార్థనతో కరగలేదు సరిగదా, మరింత బిగుసుకుపోయాడు. "లాబం నేదు. నా బాకీ రెండ్రోజుల్లోగా కక్కాలి. లేకపోతే నేనేటి సేస్తానో నాకే తెల్దు" అన్నాడు.

అప్పారావుకి పీకల వరకూ కోపం వచ్చింది. పిన్నమ్మ పరిస్థితి అంతా తెలిసీ, కావాలని సతాయిస్తున్న అప్పలసూరిని నమిలి మింగెయ్యాలన్నంత కోపంతోనే-"అయ్యా, సావుకోరు బాబూ, వున్నట్టుండి పాత బాకీ పైసల్తో

## ఆహ్వానం

రావమ్మా చిత్రభాను! రాకాశశిబింబమై
తేవమ్మా సిరుల వెలుగు
నవయుగారంభమందు
క్రొమ్మావి లేచిగురు కొసలన్ని నమలి నమలి
కోయిలమ్మ పాడినట్టి పాటే నీ మాటగా
పూదేనియ లన్ని దెచ్చి పొదిమి తేనెపట్టు పెట్టు
జుంటి తేనెటీగ సాగు బాటే నీ పాటగా
మంచు కన్న చల్లగా మమతల హరివిల్లుగా
కన్నవారి అభ్యున్నతి కాంక్షించే తల్లిగా
అందాల బృందావని అందరి సదనమ్ముగా
గోవిందుని పదనర్తన కుజనుల మదమణచగా
ధూర్తరాజకీయాలను దుష్కర్మప్రభావాలను
దూరం చేసే జననీ భారమింక నీ పైనే
మము గన్నతల్లిగా మనసు పాలవెల్లిగా
మాతృత్వం పొంగి పొరలి దాతృత్వసుభావనలతో
ఆకాశదీపాలవి అందించే వెలుగులన్ని
అందరికీ సమానమని అదియే మన
విధానమని
సమధర్మం, సమభావం సహజీవన
మనివార్యం
అందరి కీ మాట దెలుప నరుదెంచగ
రావమ్మా!
మనసంతా శాంతిగా తామసులకు క్రాంతిగా
దివ్యమైన నవ్యజగతి ఇచ్ఛాపరిపూర్తి జేయ
రావమ్మా చిత్రభాను రాకాశశిబింబమై!

కలువకోట నరసింహస్వామి



సహా కక్కమంటే మావేటి నీలాగ సావుకోర్లం కావే! అయినా, ఇంత అర్ధాంతరంగా తెమ్మంటే ఎవులికి మాత్రం సాజ్జెం? మేం సొంతంగా దుకాణ వెడతాన్నావన్న ఉక్రోసం కొద్దీ ఇది అడుగుతన్నావ్ తప్ప, మరో కారనం కనబడ్డం లేదు. మమ్మల్ని నిలువునా ఏలం ఏసినా రెండొందల్లేవు. కొట్టు ఎట్టాక, కాండబ్బు కల్ల జూస్తే మా కడుపులు కట్టుకునైనా అది తెచ్చి నీ మొకాన కొడతాం. మరిక ఎల్లు!" అన్నాడు.

అప్పలసూరికి ఎంతో కోపమొచ్చింది. అయినా, తమాయించుకొని ఇలా అన్నాడు: "మీ కడుపులు కట్టుకుని నా బాకీ తీర్చటం ఎందుకు? మల్లీ ఆ ఉసురు నాకే గదా తగుల్తాది? నేనో ఉపాయుం సెబుతాను. ఇనండి. రేపట్నించి మీ ఇద్దరూ నా కొట్లో పన్లోకి వచ్చేయుండి. మీ ఇద్దరికీ వొచ్చే కూలి డబ్బుల్లో సగం నా బాకీ కింద తీర్చెయ్యండి. ఏడాత్తిరగకముందే నా బాకీ తీరిపోతాది."

ఈ మాటలు ఏ ఉద్దేశ్యంతో అన్నాడో, ఆ మాటల్లో మాయే వుందో, మంచే వుందో గుర్తించలేనంతటి వెర్రిది కాదు రావులమ్మ. "సూడు, బాబూ! నీ సలా బాగానే వుంది. కానీ మేం సొంతంగా దుకాణవెడితే, నాలుగు నెల్లకే నీ బాకీ తీర్సగలమన్న నమ్మకం వుంది. ఆ పైన అప్పు తీర్సడానికి ఇంకా రెండు నెలల టైముంది. ఈ ఇసయంలో మమ్మల్ని మరి రొక్కించకు, బాబూ!" అంది ఆఖరుగా.

మీద కొస్తున్న పులిని చంపడానికి చేతిలోనున్న బాణాలన్నీ వృథా అయిపోయిన వేటగాడిలాగ తత్తరపడిపోయాడు అప్పలసూరి. తరవాత ఎంతో బాధపడిపోయాడు. అతని బాధ ఆవేశంగా మారింది. ఆవేశం అతన్ని పశువులా మార్చింది. పశువులా మారిన ఆ మనిషి-"సూస్తాను... నువ్వూ, నీ దుకానం ఎలాగుంటాయో!" అనేసి పళ్లు పటపట కొరుకుతూ బయటికి వెళ్లిపోయాడు.



అలా వెళ్లినవాడు, తన ఇంటికి వెళ్లలేదు. అతను అడుగు పెట్టిన ఇల్లు రామరాజు గారిది.

రామరాజు ఆరడుగుల మనిషి కాడు గానీ, బాగా సన్నమవడం వలన, పొడవైన వెదురుబద్దలా వుండి ఎంతో పొడవనిపిస్తాడు. అతనికి ఆస్తి వుంది. ఎంతో సంపద వుంది. కానీ, ఎంత వుందని అతన్ని అడిగితే, గబుక్కున ఫలానింత వుందని చెప్పలేడు! ఆస్తితో పాటు, ఆస్తిని ఏం చేస్తే అభివృద్ధి చెందుతుందో, ఏం చేస్తే



## పారాచూట్ ఎలా పని చేస్తుంది?

ఆకాశంలో ఎత్తున వెళ్లే విమానం నుంచి మనిషి కిందికి దూకుతాడు. భూమికి వున్న ఆకర్షణశక్తి వల్ల మనిషి నేల వైపుగా పడుతుంటే అతని వేగం బాగా పెరుగుతుంది. విమానం లోంచి దూకినవాడు పారాచూట్‌ను తెరచుకుంటాడు. మనిషిని కిందికి లాగే భూమ్యాకర్షణశక్తికి వ్యతిరేకంగా పారాచూట్ విచ్చుకోవటం వల్ల బోలెడంత గాలి పారాచూట్ గొడుగులోకి దూరి, దాన్ని పైకి తోయటానికి ప్రయత్నిస్తుంది. మనిషిని భూమి ఎంత బలంతో కిందికి లాగుతున్నదో, అంతే బలంతో పారాచూట్‌లోని గాలి దాన్ని పైకి తోస్తుంది. అప్పుడు మనిషి కింద పడే వేగం పెరగక స్థిరంగా వుండి పడుతూవుంటాడు. పారాచూట్ గొడుగు వైశాల్యం ఎక్కువగా వుంటుంది కనుక ఈ వేగం త్వరగా వచ్చేస్తుంది. ఫలితంగా మనిషి దెబ్బ తినని విధంగా నేల మీదికి దిగుతాడు.


మనిషి చాలా తెలివితో ఇలాంటి ఏర్పాట్లు చేసుకున్నాడు. ప్రకృతిలో జంతువులకు కూడా పారాచూట్లు వున్నాయంటే చాలా ఆశ్చర్యం కలుగుతుంది. ఉదాహరణకు ఉడత విషయమే తీసుకుందాం. అది సులువుగా ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి దూకుతూవుంటుంది. ఆ సమయంలో కావలసిన దిశకు వెళ్లేందుకు అది తన తోకను చుక్కానిగా వినియోగించుకుంటుంది. ఎత్తు నుంచి కిందికి ఉడత దూకటంలో ఒక్కొక్కపుడు గురి తప్పవచ్చు. అలాంటప్పుడు ఎత్తు నుంచి పడ్డ ఉడతకు దెబ్బ తగిలి ప్రాణహాని కలగవచ్చు. కానీ ఉడత విషయంలో అలాంటిది జరగదు. పదిహేను నుంచి పద్దెనిమిది మీటర్ల దూరం దూకినా దానికి దెబ్బ తగలదు. ఉడత తన కుచ్చుతోకను పైకెత్తుతుంది. అది పారాచూట్‌లా పని చేసి కిందికి పడుతున్న ఉడత వేగం పెరగకుండా కాపాడుతుంది. శత్రువు దాని తోకను పట్టుకుంటే అది శత్రువుకు చిక్కకుండా తోక కుచ్చులోని కొన్ని వెంట్రుకలు మాత్రం శత్రువుకు వదిలి పారిపోతుంది.

ఈ పారాచూట్ నిర్మాణం గురించిన ఆలోచనలు తొలిసారిగా 1495లో కలిగాయి. చైనీయులు క్రీడల్లో పన్నెండో శతాబ్దంలోనే వీటిని వాడేవారట. గూడు లాంటి గుడ్డ ఆధారంగా మనిషి ఎంత ఎత్తు నుంచైనా క్షేమంగా నేలకు చేరగలడని గుర్తించారు. అట్లా పారాచూట్‌ను తయారుచేసుకుని 1772లో కానన్ డెస్‌ఫోర్జెస్ అనే వ్యక్తి మొదటిసారిగా పెద్ద గోపురం ఎక్కి కిందికి దూకాడు. అయితే తగిన సాంకేతికపరిపూర్ణత లేక అతనికి కొద్దిగా గాయాలయ్యాయి.

1802లో ఫ్రెంచ్ యువకుడు ఆంద్రీ జాక్విస్ గార్నెరిన్ బెలూన్ సహాయంతో నేలకు ఒక మైలు ఎత్తుకు వెళ్లి, ఒంటికి ఒక సిల్కు బట్టను కట్టుకుని భూమి మీదికి దూకాడు. అతనికి ఏ గాయమూ కాలేదు గానీ మోషన్ సిక్‌నెస్ వచ్చి వైద్యసహాయం అందించాల్సివచ్చింది. ఇప్పుడు తయారయ్యే పారాచూట్లు చాలా నాణ్యత గలవి. దాని డిజైనింగ్ ఒక ప్రత్యేకశాస్త్రంగా రూపం పోసుకుంది. కెవ్లార్ అనే సింథెటిక్ ఫైబర్‌తో పారాచూట్లను తయారుచేస్తున్నారు.

కెవ్లార్‌కు స్టీలు కన్నా పది రెట్ల బలం వుంది. ఇది చాలా తేలికగానూ వుంటుంది. అందుకే దీనితో పారాచూట్లు చేయటం ఉపయోగకరమని దీన్ని ఎంపిక చేసుకున్నారు. ఇది ఇంకా ప్రయోగదశలోనే వుంది. చుట్టూ వున్న గాలిప్రవాహాలు పారాచూట్ విప్పుకోగానే ఎన్నో మార్పులకు గురవుతాయి. అందుకే దీని డిజైనింగ్‌లో ఎన్నో శాస్త్రసాంకేతికవిషయాలు ఇమిడివున్నాయి.

పి.వి. పర్వేశ్వరశర్మ




క్షవరమైపోతుందో కూడా అతనికి బాగా తెలుసు. అతనికి పట్నంలో చాలా వ్యాపారాలున్నాయంటారు చాలామంది.

అతను పట్నం వెళ్లినప్పుడు, ఎందుకైనా మంచిదని-ఎరిగిన వారెవరైనా ఎదురుపడితే రెండు చేతులెత్తి దణ్ణం పెడతాడు. తను పెట్టిన దణ్ణం వృథా పోదనీ, ఎప్పుడైనా ఏ రకంగానైనా ఉపయోగపడవచ్చుననీ అతని నమ్మకం. అయితే, ఏ మాట కామాటే చెప్పుకోవాలి. తన గ్రామంలో ఎవరికీ తనంత తానుగా దణ్ణం పెట్టడు. ఎందుకంటే, తన ఊరివాళ్లెవరికీ అసెంబ్లీ వరకూ వెళదామన్న ఆసక్తి గానీ, ఆ శక్తి గానీ లేవు. వాళ్లకి దణ్ణం పెట్టి ప్రయోజనం లేదనీ తెలుసు. అతను నల్లగా, మంటల్లో కాలిపోయిన వెదురుబొంగు లాగుంటాడు. అయితేనేం గాక, అందగాళ్లకు సైతం లభించని చక్కని చుక్కలు అటు విశాఖపట్నంలోనూ, ఇటు శ్రీకాకుళంలోనూ అతన్నే నమ్ముకుని జీవిస్తున్నారు. అతను ఎదురునిలిచి ఎలకనైనా చంపలేని దుర్బలుడు కావచ్చు. కానీ, అతని చేత పరాజితులైన బలవంతులు చాలామంది వున్నారు. ఆయన పెట్టిన కోర్టు కేసులకీ, పన్నిన ఉచ్చులకీ ఊపిరాడకుండా చచ్చినవాళ్లు చాలామంది వున్నారు. ఆయన చాలామందికి ఉపకారం, కొంతమందికి అపకారం చేసినమాట వాస్తవమే అయినా, ఆ ఊళ్లో జరిగే ప్రతి కేసూ ఇతని చేతి మీదనే పరిష్కారం కావాలి. న్యాయం చెప్పటంలో మాత్రం విక్రమార్కుడితో పోల్చదగినవాడని అతనితో కొన్ని వ్యాపారాల్లో వాటాలు కుదుర్చుకున్న దస్తగిరీ, భూషయ్యా, అలాంటి మరికొందరూ అభిప్రాయపడతారు. అప్పలసూరి రామరాజు గారి ఇంటికి వెళ్లడాని కిదొక్కటే కారణమని నేను చెప్పను గానీ, మరో కారణం కూడా వుంది.

అప్పలసూరి టీ దుకాణానికి అటు యాభై గజాలూ, ఇటు డెబ్భయ్యయిదు గజాల స్థలం రామరాజు గారిదే. అంటే రావులమ్మ వుంటున్న ఇల్లు కూడా అతని స్థలంలోనే వుంది. రామరాజు పెద్దమనిషి. తమకి యజమాని కాబట్టి, రామరాజు గారి చేత నయాన్నో, భయాన్నో రావులమ్మ మనసు మార్పించాలని అప్పలసూరి అభిప్రాయం. రామరాజు గారి ఇంటికి అప్పలసూరి వెళ్లేటప్పటికి అతను కొంచెం బిజీగా వున్నాడు. ఎదురుగా ముక్కాలిపీట, అందు మీద కొన్ని నోట్ల కట్టలూ, కొంత చిల్లరా, పక్కనే మరో వ్యక్తీ వున్నారు. ఆ వ్యక్తి-"సానికొంపల్ని నమ్ముకున్నోడు నష్టపోయాడేమో గానీ, సారా ఏపారాన్ని నమ్ముకున్నోడు మాత్రం సావుకారైపోతాడు, బాబూ..." అంటూ ఇంకేదో చెప్పబోతూ, అప్పలసూరిని చూసి ఆగాడు. విశాఖపట్నంలో గవర్నమెంటు సారా డిపోలను కొన్నింటిని గుత్తకు తీసుకుని రామరాజు, అదిగో-ఆ పక్కన వినయంగా నిలబడి, సారామాహాత్మ్యం గురించి చెబుతున్న ముసలయ్య కప్పజెప్పితే, ఆరు నెలలు తిరగకముందే అనుకున్నదాని కంటే ఎక్కువ లాభాలు తీసి, సదరు డబ్బును రామరాజు ముందు పెట్టి, వారి వద్ద నించి తదుపరి ఆజ్ఞల కొరకు ఎదురుచూస్తున్నాడు.


"ఏం సూరిబాబూ, ఇలాగొచ్చావు? కులాసాయేనా?" అన్నాడు రామరాజు.

"సిత్తం, తవరి దయ వల్ల ఈ కాడికిలా గుంటన్నాం" అంటూ కొంచెం నసిగి, "తవరితో ఓ సిన్న ఇసయం మనివి సేసుకుందా మనుకుంట న్నాను"

అన్నాడు, మూడో వ్యక్తి వైపు చూస్తూ.

"ఏటి? సెప్పు, పరవాలేదు. వీడూ మనవాడే. పెద్ద కూతురి పెళ్లి సంగతా?" అన్నాడు రామరాజు.

"సిత్తం, అది కాదండి. నా ఒటేలు మాటండి, నా కొట్లో పప్పు రుబ్బే రావులమ్మ నేదండీ-అది మా పెద్ద గడుసుది నెండి-నా కొట్లో రెండొంద లప్పు తీసుకుందండి. కాయితం కూడా రాసింది నెండి. తమ పాలేరు పాపారావుగోడు, కిల్లీ కొట్టు నారాయణగోడు సాచ్చిసంతకాలూ సేసారండి. నాకిప్పుడు పీకల మీదికొచ్చి, సేతిలో డబ్బాడక, నా బాకీ ఎంటనే తీర్చమని అడిగితే, టట్ ఇప్పుడొల్ల కాదు, ఓ ఆర్నెల్లు పోయాక కనబడు-అందండి. పోనీ, ఆడకూతురు గదా, ఆర్నెల్లు ఆగకూడదా అని మీలాంటి మారాజులంతా నాకు గడ్డెడతారని ఊరుకున్నాను బాబూ! కానీ, ఆ గడుసుది ముక్కులోదీ, సెవిలోదీ తీసి తాకట్టెట్టి నా మీద ఎగస్ పార్టీగా నా కొట్టు పక్కనే మరో కొట్టు ఓపినింగ్ సేస్తన్నాదండి. అయితే, అది కొట్టు ఎట్టుకుంటే నీకేటి కడుపు మంట్రా అంటారేమో! నా బాకీ తీర్చడానికి డబ్బు నేదు గానీ, ఒటేలెట్టడానికి డబ్బెక్కడిదండీ? డబ్బడగటాని కెళ్తే దానప్పకొడుకు నా మీదికి తన్నడానికొచ్చాడండీ..."




ఆవేశంతో చెబుతున్న అప్పలసూరిని ఆపి, రామరాజు-"ఇంతకీ నన్నేటి సెయ్యమంటావో సెప్పు!" అన్నాడు.

"అదే మనివి సేసుకుంటన్నానండి. తవరు నాకు ఆ రెండొందలూ అరిజెంటుగా ఇప్పించే ఏర్పాటు సెయ్యండి. లేదా, మరో ఏడాదో, రెండేల్లపాటో నా కాడే పని సెయ్యమనండి. దానికి రోజూ ఇచ్చే కూలిడబ్బుల్లో సగం ఇరగ్గొట్టుకుంటూ తీర్మానం సేసుకుంటాను. దానికైనా ఏర్పాటు సెయ్యండి" అన్నాడు వినయంగా.

రామరాజు వాలుకుర్చీలో చేరబడి, జేబులోంచి సిగరెట్టు తీసి వెలిగించి, పొగ వదులుతూ కళ్లు మూసుకున్నాడు. అంటే ఆలోచిస్తున్నాడని అర్థం. ఓ నిమిషం ఆగి, "ఇంతకీ నీ వ్యాపారం ఎలా సాగుతోందిరా?" అన్నాడు.

అప్పలసూరి చేతులు కట్టుకుని, "ఏదో తవర్లాంటోళ్ల సేతిసలవ వలన ఈ కాడికి నాలుగేళ్లూ నోట్లో కెల్తన్నాయి బాబూ! ఊరు రోజురోజుకీ పెద్దదై పోతన్నాది కదండి? ఊరికి తగ్గట్టుగా నా కొట్టు మోపు సెయ్యాలనుకుంటన్నాను గానీ, బాబూ, డబ్బుకి గొప్ప రొక్కటం పడిపోతన్నాను. లచ్చిగాడు లేనిదే బుచ్చిగాడు ఆడలేడు కదా బాబూ... నెమ్మదిగా కాలూ, సెయ్యీ కూడదీసుకుని వచ్చీ ఏటికి తల తాకట్టు పెట్టయినా సరే, ఓ రెండు ఏలు మదుపెట్టి, అన్ని టిపిన్లూ మోపు సేసానంటే మాబాగా వుంటాది నెండి. మన కొట్టు మంచి సెంటర్లో వుంది కదండి, బేరాని కేం నోటుండదండి. బోయినం సెచ్చన్ కూడా ఓపినింగ్ సేస్తే మనల్ని కొట్టే దుకానం మరోటుండదండి. కానీ, ఈ లోగా ఆ ఎదవముండ నా మీద ఎగస్ పార్టీగా కొట్టెడతందండి..." అన్నాడు.

"సర్లే, రేపు రావులమ్మని పిలిచి



అడుగుతాను. నువ్వు వెళ్లిరా" అన్నాడు రామరాజు.

"సిత్తం, తవరు కొంచెం గట్టిగా అడగాలండి. ఆడదని ఎనక్కి నాక్కండి" అంటూ అప్పలసూరి రామరాజుకి దణ్ణం పెట్టి వెళ్లిపోయాడు.

మర్నాడు రావులమ్మని పిలిపించారు రామరాజు గారు. ఆమె వచ్చేటప్పటికి, రామరాజు గారితో పాటు ఆ ఊరి పెద్దయిన సీతాపతీ, వెంకట్రామయ్యా, దస్తగిరీ, యాదగిరీ, యానాదిరావూ వున్నారు. ఆమె వచ్చి, మునుపు అప్పలసూరితో ఏమని చెప్పిందో, అలానే రామరాజుతోనూ చెప్పింది. ఆమె చెప్పినదంతా విన్నాక పెద్దల్లో ఒకరైన దస్తగిరి ఇలా అన్నాడు: "అప్పలసూరి దగ్గర ఇన్నాళ్లూ పని చేశావు. ఆ విశ్వాసమైనా చూపకుండా, అతని మీదే కత్తి గట్టి ఆ పక్కనే మరో కొట్టు పెట్టడం న్యాయమా? కొంచెం ఆలోచించు."

రావులమ్మ కొంచెం భయంతో కూడిన వినయంతో-"తవర్లాటి పెద్దలంతా నేను సేస్తన్న పని తప్పని అంటే మరి నానేం అనగలను? కానీ, నేను సొంతంగా దుకానవెట్టడం, సూరిబాబు గోరి మీద గానీ, మరొకరి మీద గానీ ఎతిరేకంగా కాదు. నా బతుక్కి నానే ఓ తోవ సూపించుకుందావని ఈ దుకానవెడతన్నాను. అంతే గానీ, మరో ఉద్దేసం లేదు" అంది.

తరవాత రామరాజు కూడా మరి కొన్ని ప్రశ్నలు వేశాక రావులమ్మని పంపించేశారు. మరునాడు తీర్పు చెబుతామని అన్నారు పెద్దలంతా.

మరునాడు తీర్పనగా, ఆ రాత్రి అప్పలసూరికి నిద్ర పట్టలేదు. రాత్రెప్పుడో నిద్ర పోయినవాడు, ఎర్రగా సూర్యకిరణాలు ఒంటికి తగిలినాక గానీ మేలుకోలేదు. గబగబా కాలకృత్యాలు ముగించుకుని, పంచాయతీ స్థలానికి వెళ్లేసరికి పెద్దలంతా హాజరయే వున్నారు. రావులమ్మ, అప్పారావు కూడా ఓ మూల చతికిలబడి కనిపించారు. చుట్టూ చాలామంది గ్రామస్థులు కూడా హాజరయ్యారు.

రామరాజు లేచి సర్దుకుని నిలబడ్డాడు. జనం నిశ్శబ్దం వహించారు. గొంతు సవరించుకొని, జేబులోంచి ఓ ఉత్తరం తీసి చేత్తో పట్టుకొని ఇలా అన్నాడు రామరాజు- "నిన్న మా అమ్మాయి దగ్గిర్నుంచి ఉత్తరం వచ్చింది. వ్యాపారవిషయాల్లో వాళ్లాయనకు-అంటే మా అల్లుడికి-తన తండ్రితో ఏవో తగాదాలు వచ్చి, మాటా మాటా పెరిగి, మా అల్లుడు తన తండ్రితో విడిపోయాడనీ, ఆస్తిలో చిల్లిగవ్వ కూడా తన భర్తకు దక్కలేదనీ, ఇలాంటి పరిస్థితుల్లో నేనే ఆదుకోవాలనీ రాసింది. దీని విషయం ఆలోచిస్తుండగా ఇంతలో ఈ తగువు పరిష్కరించవలసిందిగా పెద్దలు నన్ను ఆజ్ఞాపించారు. ఆఁ, అసలు విషయానికొద్దాం. రావులమ్మ చెప్పిందీ, అప్పలసూరి చెప్పిందీ సావధానంగా విన్నాక, మిగిలిన పెద్దలతో చర్చలు జరిపి ఓ నిర్ణయానికి రావడం జరిగింది." ఆ వెంటనే ఓ దగ్గు దగ్గాడు. కాని, పొడి దగ్గుగా ప్రారంభమైన ఆ దగ్గు ఒకంతట తెరిపి ఇవ్వలేదు. ఆయన పెళ్లుపెళ్లున దగ్గుతూ, మాట్లాడలేక, అలా అక్కడే కుర్చీలో కూర్చుండిపోయాడు. అలా ఓ ఐదు నిమిషాలు బాధ పడ్డాక, ఆయన యాదగిరి వైపు తిరిగి, "మిగిలింది మీరే చెప్పండి" అన్నాడు.

యాదగిరి సర్దుకుని నిలబడి, సమావేశమైన జనంతో ఇలా అన్నాడు: "అప్పలసూరి టీ దుకాణం, రావులమ్మ ఇల్లు వున్న స్థలం మన రామరాజు గారిదే. ఆ విషయం అందరికీ తెలుసు. మునుపొకసారి వీళ్లిద్దర్నీ ఆ స్థలం ఖాళీ చేసి, తనకప్పగించమని రామరాజు గారు కోరారు. ఆ విషయం మీ అందరికీ తెలుసో, తెలియదో మాకు తెలియదు గానీ, మా పంచాయతీ పెద్దలందరికీ తెలుసు. ఇప్పుడు రామరాజు గారికి చిక్కు సమస్య వచ్చిపడింది. శ్రీవారి అల్లుడు గారు నిస్సహాయులైన పరిస్థితుల్లో రాజు గారే తన అల్లుణ్నీ, తన కూతుర్నీ ఈ కష్టం లోంచి గట్టెక్కించదలిచి ఆ స్థలంలోనే ఓ పెద్ద హోటలు కట్టించదలిచారు. మన ఊరు ఎంతో పెద్దదవుతోంది. ఎంతోమంది రాజకీయ నాయకులూ, మంత్రులూ తరచూ ఇక్కడికి వస్తూ పోతూ వున్నారు. వారికి ఆశ్రయం ఇవ్వాలన్నా, ఆహారం ఇవ్వాలన్నా సరైన హోటలు లేదు. ఈ పరిస్థితి దృష్ట్యా కూడా అత్యాధునికమైన వసతులతో కూడిన హోటలు అవసరం. ఈ బృహత్కార్యాన్ని తలపెట్టి గ్రామాభివృద్ధికై తోడ్పడుతున్న రామరాజు గారి ప్రయత్నానికి తోడ్పడాలని అందరినీ కోరుతూ, ఓ నెల రోజులు టైము తీసుకుని అప్పలసూరి తన టీ దుకాణాన్నీ, రావులమ్మ తన ఇంటినీ ఖాళీ చేసి, రామరాజు గారికి అప్పజెప్పవలసిందిగా పెద్దలందరి తరఫునా మనవి చేస్తున్నాను."

రావులమ్మ గతాన్ని మరిచిపోయినదానిలాగ తత్తరపడింది.

అప్పలసూరి అలా స్థాణువులాగ నిలబడిపోయాడు.

000

ఇది చాన్నాళ్ల క్రితం నాటి సంగతి. రామరాజు గారు లావెక్కారు. ఇతనికి బాంకిలో వున్న డబ్బు కూడా పిల్లలు పెడుతూంది. దేశం ఎంతో అభివృద్ధి చెందుతూంది. అలాగే కృష్ణాపురం గ్రామం పెరిగి చాలా పెద్దదైంది. ఆ మధ్యనో మారు కృష్ణాపురం వెళితే, బస్సు దగ్గరికి నలుగురు రిక్షావాళ్లు వచ్చారు. 'రామరాజు భవన్'కి తీసుకెళతాం రమ్మన్నారు. విచారిస్తే తెలిసింది-ఆ ఊళ్లో రామరాజు విలాస్ ఒక్కటే పెద్ద హోటల్ అని.

చుట్టూ చేరిన రిక్షావాళ్లలో ఒకర్నడిగాను-"ఇప్పుడు అప్పలసూరీ, రావులమ్మా ఎక్కడున్నా"రని. వాళ్లు ఒకరి నొకరు వింతగా చూసుకుని, నన్ను వింతగా చూసి, "ఎవుల్నడుగుతున్నారు బాబూ, అల్ల సంగతి? ఆ దేవుణ్ని అడగాల్సిన పెశ్న!" అన్నాడు అందులో ఒకడు.

అవును మరి, అలాంటి వాటిని గురించి దేవుణ్నే అడగాలి! ■

